ఏరులై పారుతున్న మద్యం...

- అడుగడుగునా గొలుసు(బెల్టు) దుకాణాలు
- ఉత్తుత్తి గా ఎక్సైజ్ శాఖ తనిఖీలు
- పది సీసాలు మించి పట్టుకోని అధికారులు
- అంతా ఒకటై నిర్వహిస్తున్నారని ప్రజల ఆరోపణ
- దాడులు జరిగినా మూతపడని బెల్ట్ షాపులు
- ఎక్సైజ్ శాఖ పై ప్రజల్లో ఆగ్రహం

విశాలాంధ్ర-పూసపాటిరేగ : అక్కడ కలదు ఇక్కడ లేదని సందేహమే వలదు... ఎందెందు వెతికి చూసినా కావలసిన మద్యం అందే లభ్యం అగును. అదీ విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండల పరిస్థితి. మద్యాన్ని .గ్రామాల్లో బడి పక్కన, గుడి పక్కన ఉండకూడదన్న నిబంధన వున్నా ఇక్కడ అవేవీ పట్టని పరిస్థితి. చివరకు ఇక్కడ పాన్ షాపుల్లో, ఐష్ బళ్ళ దుకాణాల్లో కూడా మద్యం దొరికే వెసులు బాటు కూడా ఉంది. ఎక్కడబడితే అక్కడే మద్యం (బెల్ట్) షాపులు వెలుస్తుండటంతో మందుబాబులు దొరికిన మద్యాన్ని పూటుగా తాగి ఇష్టారాజ్యంగా రోడ్లపై చిందులు వేస్తున్నారు. అంత వరకు బానే ఉన్నా... నడిరోడ్లపై విచ్చలవిడిగా దొరుకు తుండడంతో అటుగా వెళ్ళే మహిళలు, విద్యార్థినులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు 24 గంటలూ మద్యాన్ని విక్రయిస్తూ, ప్రజల ఆరోగ్యానికి, జేబులకు చిల్లు పెడుతున్నారు. వీధికో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తుండడంతో ప్రభుత్వానికి రావాల్సిన భారీ ఆదాయానికి గండికొడుతున్నారు. ఇటువంటి పరిస్థితు లను అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు చూసీచూ డనట్టు వ్యవహరిస్తున్నారు. దాడులు పేరుతో తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి మళ్లీ మౌనం వహిస్తున్నారు. ఇప్పటివరకు మద్యం విక్రయించిన బెల్ట్ షాపులపై ఒక్క కేసులో కూడా 8 సీసాల మించి పట్టుకోలేదంటే ఎక్సైజ్ అధికారుల తీరు ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. అలాగే అధికార యంత్రాంగం వీటిపై ఉన్న మమకారం కూడా కొట్టొచ్చినట్టు తెలుస్తుంది. ఏ బెల్ట్ షాప్ లో ఎప్పుడూ ఒకసారి రైడ్ అవుతుందో ఎంత కేసు రాస్తారో ఎన్ని బాటిళు పట్టుకెళ్తారో బెల్ట్ షాపు దుకాణదారులు ముందుగానే చెప్పేస్తున్నారు. అది చూస్తే ఎక్సైజ్ అధికారులకి వాళ్లకి ఉన్న తంతు ఏంటో జనాలకు ఇట్టే అర్థం అయిపోతుంది. లైసెన్సుదారుల మద్యం దుకాణా లతో పోల్చితే, బెల్ట్ షాపుల్లో రెట్టింపు ధరలకు మద్యం విక్ర యాలు జరుపుతున్నారు. ఈ బెల్టు షాపు యజమానులు కల్తీ మద్యాన్ని విక్రయిస్తూ, ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. ఎక్కడ బడితే అక్కడ బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు జరుపుతుండడంతో ధర ఎక్కువైనా ఏ సమయం లోనైనా దొరికే వీలుంటుందని భావించి ఎంత ధరకైనా కొనేస్తూ నాణ్యత లేని మద్యం తాగుతున్నారు. ప్రభుత్వం బెల్ట్ షాపులను అరికడతాం, నాణ్యమైన మద్యం అందిస్తాం" అని ప్రకటనలు బాహాటంగా ఇస్తున్నా ఇక్కడ అవేవీ చెల్లుబాటు కావడంలేదు. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారు. ప్రజలఆరోగ్యాన్ని, ప్రభుత్వానికి రావాల్సిన శుంఖాన్ని రావాలంటే ఇప్పటికైనా పూసపాటిరేగ మండలంలో బెల్టుషాపులు లేకుండా చర్యలు తీసుకోవడమే కాకుండా నిర్వహిస్తున్నవారిపై తక్షణ దాడులు నిర్వహించి, వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తీరంలో మత్స్యకారులకు బయోమెట్రిక్ కార్డులు తప్పనిసరి

- తీర ప్రాంత రక్షణకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: తీరప్రాంత రక్షణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆదేశించారు. తీరప్రాంత భద్రత పై బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశం లో తీరప్రాంత భద్రతా కమిటీ పలు ప్రతిపాదనలు చేసింది. విజయనగరం జిల్లాలో 29 కి మీ తీరప్రాంతం ఉందని, దానికోసం రహదారి ఏర్పాటు, భద్రతా సిబ్బంది గస్తీ చేయుటకు తీరానికి ఒకటి చొప్పున వాచ్ టవర్, సముద్రం వెంబడి గస్తీ కోసం రెండు వాహనాలు, 16 సీ సి కెమెరాలు ఏర్పాటుకు కమిటీ ప్రతిపాదించింది. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ బీచ్ కారిడార్ పనులలో భాగంగా మన తీరంవెంబడి 29 కి మీ రహదారి కోసం ప్రతిపాదిస్తామనీ చెప్పారు. తీర ప్రాంత గస్తీ కోసం రెండు వాహనాలు ఒక్కో తీరప్రాంతానికి ఒక వాచ్ టవర్ ను సిఎస్ఆర్ నిధుల నుండి సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా సి సి కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. తీరంలో ఉన్న మత్స్యకారులు తప్పనిసరిగా వారికి మంజూరుచేసిన బయోమెట్రిక్ గుర్తింపు కార్డులు ధరించాలని, లేని పక్షంలో మెరైన్ పోలీసులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మత్స్యశాఖ శాఖ అధికారులు సమావేశాలు నిర్వహించినప్పుడు తప్పకుండా లైన్ డిపార్ట్మెంట్ వారికి సమాచారం ఇవ్వాలని అన్నారు. మెరైన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో విజయనగరం పట్టణం లో ఉన్న ప్రముఖ ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యాల సహకారంతో మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేయా లని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ సూపరెంటెండెంట్ తీర భద్రత విభాగం విశాఖపట్నం ఏమ్ శ్రీనివాసరావు డి ఎస్ పి, తూర్పు తీర నావికాదళ లెఫ్టినెంట్ కమాండర్ స్వప్నిల్ చౌహాన్, సీనియర్ ఇంటెలిజెంట్ ఆఫీసర్ వరప్రసాద్ అట్టాడ, ఇంటెలిజెన్స్ బ్యూరో ఆఫీసర్ వెంకటేష్ నాయుడు, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ కృష్ణ, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ సర్కిల్

పట్టణ పారిశుద్ధ్యానికి ప్రజలు సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణ ప్రజలు రోడ్లపైన మున్సిపల్ కాలువలో చెత్తను వేయరాదని పరిసరాలు పరిశుభ్రత పాటించి స్వచ్ఛ బొబ్బిలికి పట్టణ ప్రజల సహకరించాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పిలుపునిచ్చారు. రోడ్లపైన పశువుల యజమానులు విడిచి పెట్టరాదని విడిచిపెడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా శానిటరీ ఇన్స్పెక్టర్, పర్యావరణ ఇంజనీరు, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెం టల్ సెక్రటరీలతో పూల్ బాగ్, వెంకటకృష్ణ థియేటర్ రోడ్డు, వల్లభాయ్ స్కూల్ రోడ్డు ఏరియాలో పర్యటించారు. వెంకట కృష్ణ థియేటర్ వద్ద నూతనంగా నిర్మించిన కల్వర్టును పరిశీలించి ఆ కాలువలో డిసిల్టేషన్ చేయించాల్సిందిగా ఆదేశించారు. పూల్ బాగ్ రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా ఉన్న బెర్ములను క్లియర్ చేయించి కాలువలలోకి నీరు పారే విధంగా చేయాలని ఆదేశించారు. దోమల నిర్మూలనలో భాగంగా ప్రతిరోజు వార్డులలో ఫాగింగ్ మరియు స్ప్రేయింగ్ షెడ్యూల్ ప్రకారం కచ్చితంగా చేయించాలని శానిటరీ ఇన్స్పెక్టర్ వారికి ఆదేశించారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శిని కలిసిన బొబ్బిలి శ్రీను

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఇటీవల భారతీయ జనతా పార్టీ లో చేరిన బొబ్బిలి శ్రీను రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, జిల్లా అధ్యక్షులు రాజేష్ వర్మను మర్యాదపూర్వకంగా కలిసారు. పార్టీ అభివృద్ధి, బలపరిచే మార్గాలు, స్థానిక ప్రజల సమస్యలు వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. పార్టీ కార్యచరణలు, భవిష్యత్ కార్యపథకాలకు పూర్తి మద్దతు ఉంటుందని బొబ్బిలి శ్రీను తెలిపారు. రానున్న కాలంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కారం

విశాలాంధ్ర-రాజాం: రాజాం మున్సి పాలిటీ పరిధి లచ్చయ్యపేట సచివాల యం మల్లికార్జున కాలనీలో అంగన్వాడి కేంద్రం పరిధిలో తల్లిపాలు వారోత్సవాలను ర్యాలీ నిర్వహించారు. రాజాం సెక్టార్ సూపర్వైజర్ ప్రసన్న మాట్లాడుతూ తల్లిపాలు విశిష్టతను, తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కారం అని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు విజయ్ కుమారి, ఎం శ్రీదేవి, రమాదేవి, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి

ఎంఈఓ బాల భాస్కరరావు

విశాలాంధ్ర-వేపాడ: పాఠశాల పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవా లని ఉపాధ్యాయ సిబ్బందికి మండల విద్యాశాఖ అధికారి పి.బాల భాస్కర రావు సూచించారు. మండలంలోని బొద్దాం, కొత్త బొద్దాంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలల పరిసరాలు తరగతి గదులు కిచెన్ గార్డెన్ మొదలగునవి పరిశీలించారు.అలాగే గోడ చార్టు, విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీషు, చదివించడం, రాయించడం, చతుర్విధ ప్రక్రియలు చేయించి వర్క్ బుక్స్ పరిశీలించారు. అనంతరం శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం నిర్వాహకులను కలసి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఉపాధ్యాయులు తో సమావేశం ఏర్పాటు చేసి ఎస్ ఆర్ కె వి ఎం కిట్స్ ఆన్లైన్ డ్రిస్ట్యూషన్,మొదలగు అంశాలపై సూచనలు సలహాలు అందించారు.అనంతరం ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాఠశాల ఆవరణలో ఏటువంటి చెత్తాచెదారాలతో పాటు కలుపు మొక్కలను లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలి

వెలమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాము నాయుడు

విశాలాంధ్ర-వేపాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అంది స్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం విద్యార్థులకు వండి పెట్టాలని వెలమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన గుడిపాల సర్పంచ్ బొజంకి రామునాయుడు అన్నారు. మండలంలోని చిన గుడిపాల మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం పరిశీలించారు. అలాగే మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్నది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులతో కలిసి డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం రుచి చూసారు.అనంతరం విద్యార్థులను ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు.బాల్యం వయసు నుండే విద్యాభ్యాసం వైపు దృష్టి సారించి భవిష్యత్తులో మంచి చదువు చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అలాగే ప్రతి విద్యార్థి బంగారు భవిష్యత్తు బాటలు వేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పథకం సిబ్బందితో ఎంపిడిఓ సమీక్ష



విశాలాంధ్ర.రాజాం: ఎన్ఆర్ఈజీఎస్ టిఏలు, ఇతర ఉద్యోగులు, అసిస్టెంట్ లతో ఎంపిడిఓ వావిలపల్లి. శ్రీనివాసరావు బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రగతిపై సమీక్ష జరిపారు. వారికి పలు సూచనలు చేసారు. సచివాలయం తనిఖీ ప్రతీరోజూ గ్రామ సందర్శన కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని అంతకాపల్లి గ్రామాన్ని ఎంపిడిఓ సందర్శించారు. చెత్త సేకరణ, బోర్వెల్స్ పనితీరు తదితరమైన వాటిని పరిశీలించారు.

ఇరిగేషన్ డి.ఈ తో చీపురుపల్లి ఎమ్మెల్యే సమీక్ష

రైతులకు సమస్యలు లేకుండా చూడాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-చీపురుపల్లి : ఇరిగేషన్ శాఖ నుండి రైతులకు, ప్రజలకు ఎటువంటి సమస్యలు రాకుండా చూసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చీపురుపల్లి శాసనసభ్యుడు మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ పోలీస్ బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకట్రావు అధికార ఆదేశించారు.. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నందు అధికారులతో సమీక్ష నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు చెట్టు పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు వివరా లను అధికారులను అడిగి తెలుసుకున్నారు.. త్వరితగతిన బిల్లులు చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఇరిగేషన్ శాఖ అధికారిని ఆదేశించారు.

గిరిజనుల భూములను లాక్కోవడం దారుణం..

విశాలాంధ్ర-రామభద్రపురం: ఎన్నో సంవత్సరాలుగా గిరిజనుల సాగు చేసు కుంటున్న పోడు భూములను ఎంఎస్ సమీ పార్క్ అభివృద్ధి పేరుతో కూటమి ప్రభుత్వం గిరిజనుల భూములను బలవంతంగా లాక్కోవడం చాలా దారుణమని రాష్ట్ర మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి పీడికి రాజన్న దొర అన్నారు. బుధవారం స్థానిక మాజీ శాసనసభ్యులు వెంకట చినప్పలనాయుడు, మండల అధ్యక్షులు చొక్కా పు లక్ష్మణరావు తో కలిసి కాకర్లవలస వద్ద భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజన్న దొర మాట్లాడారు. 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఆర్ ఓ ఎఫ్ పట్టాలి ఇచ్చిందని గుర్తు చేశారు. గిరిజనుల చేతిలో పట్టాలు ఉన్నప్పుడు 2017లో ఏపీ ఐసీసీ పేరుతో ఇదే తెలుగుదేశం ప్రభుత్వం బలవంతంగా ఏపీఐసీసీకి కేటాయించడం చాలా దారుణమని అన్నారు. పదేళ్ల గడుస్తున్నప్పటికీ ఆ ప్రాంతంలో ఇంతవరకు ఒక్క అభివృద్ధి పని కూడా జరుపుకుంటా ఇప్పుడు ఎం ఎస్ ఎం పార్క్ పేరుతో కూటమి ప్రభుత్వం డ్రామాలు ఆడడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందితే సంతోషమే కానీ స్థానికంగా ఉన్న గిరిజనులతో సంప్రదించకుండా బలవంతంగా మిషన్లు పెట్టి భూములు చదును చేయడం న్యాయమని ప్రశ్నించారు. మాజీ శాసనసభ్యులు సంభంగి మాట్లాడుతూ జీడి మామిడి జొన్న ప్రతి తదితర పంటలు ఉన్నప్పటికీ అభివృద్ధి పేరుతో పచ్చని చెట్లను నరికివేసి పర్యావరణాన్ని పాడు చేయడమే కదా అన్నారు. స్థానికంగా గిరిజనులకు ఎటువంటి అన్యాయం జరిగినా వైఎస్ఆర్సిపి పార్టీ అండగా ఉంటదని అన్నారు. తక్షణమే ప్రభుత్వము ఆ భూములను పరిశీలించి గిరిజనులకు న్యాయం చేసిన తర్వాతే అక్కడ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేయవలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు డ ర్రు పైడిరాజు, పత్తి గుల్ల చంద్రశేఖర్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కిర్ల శేకర్, అప్పారావు, సిపిఎం నాయకులు బలస శ్రీను కాకర్లవలస కార్యదవలస గిరిజనలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇందుకూరి కు జిందాల్ భూ నిర్వాసితుల దరఖాస్తుల వెల్లువ...

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్ కోట మండలం బొడ్డవర లో బుధవారం జిందాల్ నిర్వాసితులు ఎమ్మెల్సీ రఘురాజు ని కలిసి జిందాల్ ను నమ్మి మోసపోయామంటూ దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా జిందాల్ నిర్వాసితులు మాట్లాడుతూ, తాము తమ పిల్లల భవిష్యత్తు బావుంటుంది అని నమ్మి భూములు ఇచ్చామని, తమ కుటుంబము లో ఉద్యోగాలు, షేర్ లు ఇస్తామని నమ్మించి భూములు తీసుకుని మోసం చేశారు అన్నారు. రైతులు 17 సంవత్సరాల గా పడుతున్న తమ సమస్యలు త్వరగా పరిష్కరించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా రఘు రాజు రైతుల తో మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నానని, దేశ రాజధాని ఢిల్లీ లో మానవ హక్కుల సంఘం ను కలిశానని, అలాగే రాజ్యాంగ బద్ధ సంస్థలు అయినటువంటి, జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ ను, జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ కు సైతం సమస్యలు గురించి వివరించాను అని చెప్పారు. దేశ రాజధాని లో రైతుల సమస్యల పరిష్కారం దిశ గా అడుగులు పడ్డాయి అని రైతులకు వివరించారు.త్వరలోనే రైతుల కి న్యాయం జరుగుతుంది అని అన్నారు.

పేద ప్రజలకు అన్యాయం జరిగితే సహించేది లేదు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: పేద ప్రజలకు అన్యాయం జరిగితే సహించేది లేదని మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్ అన్నారు. బుధవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పి ఫోర్ కార్యక్రమం ద్వారా పేద ప్రజలను బంగారు కుటుంబాలుగా మారుస్తామని చెబుతున్న కూటమి ప్రభుత్వం నిజమైన పేదవారిని గుర్తించాలన్నారు. నిజమైన పేదవారికి అన్యాయం జరిగితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పేదవారుగా జరిగిన మ్యాపింగ్ లో అనేక అవకతవకలు ఉన్నాయన్నారు. అధికారులు నిజమైన పేదవారిని గుర్తించాలన్నారు. ప్రస్తుతం పి ఫోర్ కార్యక్రమం పూర్తిగా రాజ్యాంగానికి విరుద్ధంగా చేస్తున్నారన్నారు. కార్పొరేట్ సంస్థలు కేవలం ఐటీ రిటర్న్స్ చూపడానికే తప్ప నిజమైన పేదవారికి న్యాయం జరగదన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలోనే రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మందిని దత్తత తీసుకోవడం జరిగిందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం తప్పుడు ఆలోచనలతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం సబబు కాదన్నారు. వెంటనే అధికారులు నిజమైన లబ్ధిదారులను గుర్తించి బంగారు కుటుంబాలుగా మార్చడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రంగా, గాదం మురళి, అల్లు చాణిక్య, బాబు వైసీపీ నాయకులు భానుమూర్తి, రామకృష్ణ ,వందు తదితరులు పాల్గొన్నారు.

ఫారం ఫాండ్స్ పై ప్రత్యేక దృష్టి సారించండి

డ్వామా పిడి శారదాదేవి

విశాలాంధ్ర-మెరకముడిదాం: గ్రామాల్లో ఉపాధి పనుల్లో భాగంగా రైతులకు ఉపయోగపడే ఫారం ఫాండ్స్ పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శారదాదేవి ఉపాధి సిబ్బందికి సూచించారు. బుధవారం ఆమె స్థానిక ఎంపీడీఓ కార్యాల యంలో ఉపాధి సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులకు నిర్వహిస్తున్న ఎస్ఎంఎంఎస్ - 2.0 పై శిక్షణ, సమీక్ష కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ హార్టీ కల్చర్, ఎవెన్యూ ప్లాంటేషన్, చెరువు గట్లపై మొక్కలు, ప్రభుత్వ సంస్థలలో మొక్కలు పెంచడం పై ఆమె సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు పలు సూచనలు చేశారు. అలాగే గట్లు చుట్టూ మునగతో పాటు పలు రకాల పండ్లు చెట్లు వేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అలాగే చేపలు పెంపకం, కూరగాయలు పెంపకం పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఏపీఓ కామేశ్వరరావు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ నరేంద్ర కుమార్, పలువురు సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగస్తులకు సన్మానం

విశాలాంధ్ర-తెర్లాం: మండలం లో వెలగవలస గ్రామ సచివాలయం సిబ్బంది ఉద్యోగం రీత్య బదిలీ అయిన ఉపాధ్యాయులు, సెక్రటరి మరియు పలువురు సచివాలయం సిబ్బంది కి బుధవారం వైస్ ఎం పి పి, ఆ గ్రామ సర్పంచ్, మాజీ సర్పంచ్, గ్రామ పెద్దలు,తోటి ఉపాధ్యాయులు కలసి వారు బదిలీ అయినా సందర్బంగా శాలువ లు కప్పి సన్మానం చేసి పుష్ప గుచ్చాలు అందజేశారు. ఈ సందర్బంగా అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు రవణ మేసారు మాట్లాడుతూ ఈ గ్రామానికి మీరు చేసిన సేవలు మరివలేనివి అని, ఉపాధ్యాయులు కానీ, సచివాలయం సిబ్బంది కానీ ఈ గ్రామం లో ప్రజలకు సక్రమంగా సేవలు అందించారని, అలాగే మీరు ఏ మండలం లో గ్రామ సచివాలయం కు వెళ్లిన అక్కడ కూడా సక్రమంగా ప్రజలకు మెరుగైయినా సేవలు అందించాలని కోరుతున్నామని ఈ సమావేశం లో రవణ మేసారు తెలిపారు.

నేడు చేనేత దినోత్సవం

జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు మురళీకృష్ణ

విశాలాంధ్ర-విజయనగరం: జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని రాజాంలో గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు ఆర్‌వి మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రాజాం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి నటరాజ కల్యాణ మండపం వరకు హ్యాండ్‌లూమ్ వాక్ నిర్వహిస్తామని, అక్కడ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ చేనేత కార్మికులను సన్మానించనున్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా 1905లో విదేశీ వస్త్రాలను బహిష్కరిస్తూ, స్వదేశీ వస్త్రాలను ప్రోత్సహించే ఉద్యమాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని 2015 నుంచి గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతీ సంవత్సరం ఆగస్టు 07ను జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని వివరించారు. రాజాంలో నేడు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఏడి మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు.

పల్లె నిద్ర"తో ప్రజలకు మరింత భరోసా కల్పిస్తున్నాం : ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలోని ప్రతీ పోలీసు స్టేషను పరిధిలోగల గ్రామం లేదా వార్డులో ఎస్ఐ లేదా సిఐ స్థాయి అధికారులు మరియు దత్తత గ్రామాల కానిస్టేబుళ్ళు 'పల్లె నిద్ర' చేపట్టే విధంగా అధికారులను ఇప్పటికే ఆదేశించామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - పల్లె నిద్ర కార్యక్రమంతో ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని చూపుతాయన్నారు. నేరాల నియంత్రణ, ప్రజల సహకారంతో పోలీసింగ్ మరింత బలోపేతం చేయడమే 'పల్లె నిద్ర' ప్రధాన లక్ష్యమని అన్నారు. అలాగే, గ్రామాల్లో చిన్న చిన్న గొడవలు పెద్ద నేరాలుగాను, శాంతిభద్రతల సమస్యగా మారే అవకాశముందని, ఇలాంటి అంశాలను క్షేత్ర స్థాయిలో గుర్తించి, చర్యలు చేపడుతున్నామన్నారు. పోలీసు స్టేషన్లుకు వెళ్ళకుండానే వారి సమస్యలను నేరుగా పోలీసు అధికారులకు తెలిపేందుకు 'పల్లె నిద్ర' ఒక వేదికగా నిలుస్తుందన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమై, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విషయాలను, గ్రామంలో వివిధ రాజకీయ పార్టీల మధ్యగల విభేదాలను, భూతగాదాలను క్షేత్ర స్థాయిలో గుర్తించి, శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసేందుకు, ప్రజలకు రక్షణగా నిలిచే చట్టాలు, సైబరు మోసాలు, మహిళలు, రహదారి భద్రతపట్ల అవగాహన కల్పించేందుకు 'పల్లె నిద్ర' కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నామన్నారు. అపరిచిత వ్యక్తులకు ఓ.టి.పి.లను చెప్పవద్దని, అపరిచిత వ్యక్తులు పంపే లింకులు, ఎ.పి.కే. ఫైల్స్ ను క్లిక్ చేయవద్దని, సైబరు మోసాలకు గురైతే 1930కు ఫిర్యాదు చేయాలని, మహిళల భద్రతకు ప్రత్యేకంగా రూపొందించిన 'శక్తి యాప్'ను వినియోగించి, ఆపద సమయంలో రక్షణ పొందవచ్చునో వివరిస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.జిల్లాలో 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటి నుండి ఇప్పటి వరకు 300 గ్రామాల్లో పోలీసు అధికారులు 'పల్లె నిద్ర' చేపట్టారన్నారు. ప్రజలతో మమేకమై, వారి సమస్యలను నేరుగా క్షేత్ర స్థాయిలో తెలుసుకొని, పరిష్కరించేందుకు, శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు 'పల్లె నిద్ర' కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

గుర్లలో తప్పిన పెనుప్రమాదం -10మందికి తీవ్ర గాయాలు

కారు యజమాని(సర్పంచ్) సూరిబాబుకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-గుర్ల : మండలంలో మండల కేంద్రం గుర్లలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బుధవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటన ఒక్కసారిగా ఆ ప్రాంత వాసులు ఉలిక్కిపడేలా చేసింది. అరుపులు కేకలతో ఆ ప్రాంతం దద్దరిల్లి పోయింది అసలు ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది రెప్పపాటులో ఒక్కసారిగా జరగరాని.ఘోరం జరిగిపోయింది. అతి వేగంతో కారు దూసుకు రావడంతో ఘోర ప్రమాదం సంభవించిందని ప్రయాణికులు అంటున్నారుఒకవైపు బస్సు ఒదిగిపోయింది ఇంకోవైపు కారు తూనక తోనకలైంది. ప్రాణాల పోయినట్లు అందరూ కేకలు వేశారు.చుట్టుపక్కల నుంచి వెంటనే అక్కడకు జనాలు చేరుకొని బస్సుల్లో ఉన్న ప్రయాణికులను కారులో ఉన్న కారు యజమాని సూరిబాబును బయటకు ప్రాణాలతో తీశారు చిన్న చిన్న గాయాల తప్ప ఎవ్వరికి ప్రాణాపాయం లేకుండా చూసారు.ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. విజయనగరం -చీపురుపల్లి రోడ్డుపై ప్రయాణిస్తూ ఎదురెదురుగా వస్తూన్న ఆర్టీసీ బస్సు కారు గుద్దుకున్నాయి.గుర్ల స్మశానం వద్ద ఈ సంఘటన జరిగింది. చీపురుపల్లి నుండి విజయనగరం వైపుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును గట్టిగా ఢీ కొట్టిన మహీంద్ర తార్ కారు తునక తోనకలు అయింది. ప్రమాదాన్ని తప్పించాలనే ఉద్దేశ్యం తో రోడ్డు సైడుకు వెళ్లిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలు అయ్యాయి బస్సులో సుమారు 20 మంది వరకు ఉన్నారు అందులో గోషాడ నెల్లిమర్లకు చెందిన వారు అందులో ఆరుగురికి జె. శాంతమ్మ ,పెంటమ్మ, నాగరాజు, రాము, సూర్య బంగారమ్మ, శ్రీదేవి,స్వల్ప గాయాలయ్యాయి. కారు యజమాని గుర్ల మండలం గెరిడ గ్రామ సర్పంచ్ తిరుమరెడ్డి సూరిబాబుకు తీవ్ర గాయాలు కావడంతో విజయనగరం మహారాజ ఆసుపత్రికి తరలించారు అందరిని అక్కడికి తరలించారు అక్కడ వైద్యం పొందుతున్నారు. పెను ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన తెలిసిన వెంటనే ఎస్సై పి. నారాయణరావు తమ సిబ్బందితో కలిసి సంఘటించాలని చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.....

మురుగు నీటిలో మంచినీటి బోరు

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: ఎస్.కోట దార గంగమ్మ తల్లి ఆలయం ప్రాంతంలోని మంచినీటి చేతి బోరు ఇటీవల మురుగునీటిలో మునిగిపోయింది. ఈ బోరుపై ఆధారపడిన స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పంచాయతీ కుళాయిల ద్వారా నీరు రోజు తప్పించి రోజు మాత్రమే అందుతున్నందున, ఈ బోరు ప్రజలకు కీలకమైన నీటి వనరుగా ఉంది. అయితే, ఇప్పుడు అది మురుగు కాలువ మధ్యలో చిక్కుకుపోయి, దుర్గంధం మరియు అస్వచ్ఛతకు కారణమవుతోంది. ప్రజలు తాగునీటి కోసం ఈ బోరును ఉపయోగించాల్సి వచ్చినప్పుడు, మురుగునీటి కలుషితం వల్ల ఆరోగ్య ప్రమాదాలు ఎదురవుతున్నాయి. ఇది ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు మరియు రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఎక్కువ ప్రమాదాన్ని కలిగిస్తోంది. పంచాయతీ అధికారులు వెంటనే ఈ సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

దేశ రాజధానికి చేరిన జిందాల్ నిర్వాసితుల వ్యథ

సానుకూలంగా స్పందించిన ఎన్.హెచ్.ఆర్.సి

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎమ్మెల్సీ ఇందుకూరి రఘు రాజు తన నివాసంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత నెల రోజులుగా జరుగుతున్న జిందాల్ నిర్వాసితుల నిరసన కార్యక్రమం గురించి, రైతుల బాధల గురించి కానీ ఇక్కడ ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం నుండి కానీ, రాష్ట్ర స్థాయి నుండి కనీశ స్పందన లేదన్నారు. ఎలా అయినా రైతుల సమస్యలకి పరిష్కారం చూపాలని దేశ రాజధానికి ఢిల్లీకి జిందాల్ సమస్యలను తీసుకు వెళ్లినట్లు తెలిపారు. జాతీయ మనవ హక్కుల సంఘంను కలసి జిందాల్ నిర్వాసితుల సమస్యల గురించి మాట్లాడటం జరిగింది అన్నారు. మానవ హక్కుల సంఘము ఫిర్యాదును స్వీకరించి విచారణ మొదలు పెట్టింది అన్నారు. ఎన్.హెచ్.ఆర్.సి 15 రోజులలో కలెక్టర్ గారికి నివేదిక అందిచమని మనవ హక్కుల సంఘం ఆదేశించింది అన్నారు. ఈ విషయం రైతులకి తెలపడం చాలా సంతోషం ఇచ్చిందని, అలాగే రాజ్యాంగ బద్ధ సంస్థలు అయిన జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్‌ను, జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్‌ను కలవడం జరిగింది అన్నారు.

అయితే త్వరలోనే రైతుల సమస్యలు తీరబోనున్నాయని అన్నారు. విజయనగరం జిల్లా కలెక్టర్ వారిని కలిసి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి అమలులో లోపాలు, ఉద్యోగాలు ఇవ్వకపోవడం, షేర్‌లలో జరిగిన మోసం గురించి విపులంగా వివరించడం జరిగిందన్నారు.

తూప్రాన్ గ్రామానికి గద్దర్ పేరు పెట్టాలి

జిల్లా సామాజిక న్యాయ ఉద్యమ వేదిక కన్వీనర్ గంటాన

విశాలాంధ్ర - చీపురుపల్లి: ప్రజా గాయకుడు గద్దర్ జన్మించిన తూప్రాన్ గ్రామానికి గద్దర్ అన్న పేరును పెట్టాలని జిల్లా సామాజిక న్యాయ ఉద్యమ వేదిక కన్వీనర్ గంటల అప్పారావు డిమాండ్ చేశారు. బుధవారం నాడు గద్దర్ మరణించి రెండు సంవత్సరాలు జరిగిన సందర్భంగా రావివలసలోని తన స్వగృహంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్ అన్న మరణించినప్పటికీ ఆయన మాటలు పాటల తూటాలు ఇప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయి అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ నెల్లిమర్ల ఇన్చార్జి ఎరుకొండ వెంకటరావు, ఓరి రమేష్, బహుజన నాయకులు బోనెల కాముడు పూల మాలను వేసి జోహార్లు తెలుపుతూ నివాళులర్పించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

విశాలాంధ్ర - రాజాం: రాజాం-బొబ్బిలి రోడ్డులోని వస్త్రపురి కాలనీ వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ అధికారి పైల అశోక్ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆయిల్, గ్యాస్ వలన అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏ సమయంలో వేటిని వినియోగించాలనే దానిపై ప్రదర్శించి చూపారు. వేసవిలో ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

చీపురుపల్లి అడ్డాగా నాసిరకం వస్తువులు సరఫరా

కోట్లాది రూపాయల దోపిడిని నిరూపించడానికి సిద్ధం మాజీ విప్ గద్దె బాబురావు

విశాలాంధ్ర - చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలలో వసతి గృహాలకు సరఫరా అవుతున్న నాసిరకం వస్తువులను చీపురుపల్లి కేంద్రంగా చేసుకొని సరఫరా చేస్తున్నారని మాజీ విప్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ గద్దె బాబురావు అన్నారు. బుధవారం చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చీపురుపల్లి సెంట్రల్ పాయింట్‌గా చేసుకొని సుమారు 500 కోట్ల రూపాయల కుంభకోణం ఈ సరఫరా లో జరుగుతుందని ఆయన అన్నారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలకు 75 కోట్ల రూపాయల టెండర్లను చీపురుపల్లి వాసులే తాజాగా దక్కించుకున్నారని ఆయన వివరించారు. రెండు రాష్ట్రాలకు టెండర్లు పలికిన సదరు వ్యాపారులు పనికిరాని పప్పు ముక్కుపోయిన కందిపప్పు పెసరపప్పు పసుపు వంటివి రెసిడెన్షియల్ స్కూల్ నవోదయ తదితర వస్తు గృహాలకు అంటగడుతూ అక్రమంగా ప్రభుత్వ సొమ్మును దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ సంఘటనపైన రాష్ట్ర ముఖ్యమంత్రి లేదా ఇంటెలిజెన్సీ విభాగం అధికారులు చర్యలు తీసుకుని అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ఆయన కోరారు. చీపురుపల్లి కేంద్రంగా జరుగుతున్న అక్రమ వ్యాపారం కారణంగా పార్టీ ప్రతిష్ట కూడా దెబ్బతింటుందని గద్దె అన్నారు. ఇప్పటికే శ్రీకాకుళం విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసి ఫోన్ ద్వారా కూడా సమాచారం అందించానన్నారు.

జగన్నాథవలసలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - వంగర: మండలం జగన్నాథవలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. మండల వ్యవసాయ అధికారి తట్టికోట కన్నబాబు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రతి ఒక్క రైతు వరి, మొక్కజొన్న పంటలకు ఇన్సూరెన్స్ కట్టుకోవాలని తెలియజేశారు. వరి పంటకు ఎకరానికి 200 రూపాయలు, ఆఖరు తేది ఆగస్టు 14, మొక్కజొన్న పంటకు 165 రూపాయలు ప్రీమియం కట్టడానికి ఆఖరి తేదీ ఆగస్టు 15లోగా రైతులందరూ రిజిస్టర్ చేసుకోవాలని తెలియజేశారు. దిగుబడి ఆధారంగా పంట నష్టం సంభవిస్తే ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తట్టికోట కన్నబాబు, వీఏఏ సాయి తేజ రైతులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్ఠం

విశాలాంధ్ర- మెరకముడిదాం : బిడ్డకు పాలివ్వడం తల్లికి లాభమేనని, బ్రెస్ట్ క్యాన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధుల బారి నుండి బయట పడవచ్చునని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షకురాలు టి. శ్రీదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన మెరకముడిదాం సచివాలయ ప్రాంగణంలో ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. తల్లిపాలు ఆవశ్యకతను తెలుపుతూ గ్రామ పురవీధుల్లో అంగన్వాడీ సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు,కుటుంబ సభ్యులు, గర్భిణీలు, కిషోర్ బాలికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పర్యవేక్షకురాలు టి.శ్రీదేవి మాట్లాడుతూ తల్లిపాలుకు మద్దతునిచ్చి స్థిరమైన వ్యవస్థను ఏర్పాటు చేసి తల్లిపాలు బిడ్డకు ఇచ్చే సంస్కృతిని ప్రోత్సహించాలని ఆమె కోరారు. తల్లి పాలు బిడ్డకి అమృతం వంటివని, బిడ్డ పుట్టిన గంట లోపే తల్లి పాలు బిడ్డకుఇవ్వాలని అన్నారు. బిడ్డకు ఆరు నెలల వరకు తల్లి పాలు ఇవ్వడమే శ్రేయస్కరం అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం మహిళా పోలీస్ ఎం .ఎస్ .కె సాధన ,అంగన్వాడీ కార్యకర్తలు గౌరీ, గాయత్రి, అప్పల రాము, వరలక్ష్మి , ఏ ఎన్ ఎం కే కోటేశ్వరమ్మ , ఆశ కార్యకర్తలు సూర్య,లలిత, కుమారి పాల్గొన్నారు.

వేపాడ: పుట్టిన ప్రతి శిశువుకు తల్లిపాలు ఆరోగ్యంతో పాటు రక్షణ కవచంలా కాపాడుతుందని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అధికారిణి, ఆర్.ఉమాదేవి అన్నారు. మండల కేంద్రమైన వేపాడ శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో వేపాడ, నీలకంఠరాజపురం, బొద్దాం సెక్టర్ల సమక్షంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని గర్భిణీలకు శ్రీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వియ్యంపేట ప్రాజెక్టు సిడిపిఓ ఆర్.ఉమాదేవి, ఏ సి డి పి ఓ లక్ష్మిబాయిలు మాట్లాడుతూ శిశువు పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు ఇవ్వడం వలన మొదటి టీకాతో సమానంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సేనాపతి అప్పారావు, గ్రామ సర్పంచ్ మెలిపాక అర్జునమ్మ,ఆయా సెక్టార్ల సూపర్వైజర్లు పి.భాగ్యవతి డి. అరుణశ్రీలు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సృజన, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

భోగాపురం: ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా బోగాపురం మండలంలోని రావాడ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి హెల్త్ విజిటర్ కిమిడి రాణి, ఎంఎల్ హెచ్ పి రమాదేవి పాల్గొని తల్లి పాల ప్రాముఖ్యత గురించి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "తల్లి పాలు త్రాగడం వల్ల శిశువులకు ఆరోగ్యంగా ఎదిగే శక్తి లభిస్తుంది. పోషకాహారంతో పాటు రోగనిరోధక శక్తి పెరిగి, మెదడు పరిణితికి సహాయపడుతుంది. అలాగే న్యూమోనియా, అతిసారం వంటి వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది" అని తెలిపారు. తల్లుల విషయానికొస్తే, పాలు ఇవ్వడం వల్ల రొమ్ము, గర్భాశయం, అండాశయ క్యాన్సర్లు, మధుమేహం వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని, ప్రసవానంతర వేగంగా కోలుకోవచ్చని, తల్లి%-%బిడ్డల బంధం మరింత బలపడుతుందని చెప్పారు. తల్లి పాలు బిడ్డ శ్రేయస్సుకు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమాన్ని పి హెచ్ యెన్ సావిత్రి, ఎ యెన్ ఎం పద్మ, ఆశా వర్కర్లు, అంగన్వాడి సిబ్బంది గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు

కూటమి నేతలకు అబద్ధాలు అలవాటు: వైసీపీ

విశాలాంధ్ర - చీపురుపల్లి: అధికారంలోనికి రావడం కోసం పచ్చి అబద్ధాలాడి, అధికారం అందలం ఎక్కిన తర్వాత అబద్ధాలు అలవాటై ప్రజా సంక్షేమం పట్టక అబద్ధాలు ఆడుతున్న నాయకులు కూటమి నాయకులు ప్రజాక్షేత్రంలోనే ఎవరు హయంలో సంక్షేమం జరిగిందో తేల్చుకుందామని కిమిడి నాగార్జునకు వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం,జిల్లా ప్రచారకమిటీ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల అధ్యక్షులు మీసాల వరహాలనాయుడు సవాల్ విసిరారు. పత్రికా సమావేశంలో వైసీపీ నేతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 80% హామీలు అన్ని అమలు చేసిందని అది చూసి వైస్సార్ పార్టీ నాయకులు భయపడుతున్నారు అని మాట్లాడడం చూస్తుంటే హాస్యాస్పదంగా వుందన్నారు. కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలు ఇస్తామని ప్రజలని నమ్మించి అధికారంలోనికి వచ్చారని, అధికారంలోకి వచ్చి 13 నెలలు దాటినప్పటికి మీరు చెప్పిన సూపర్ సిక్స్ హామీల్లో కేవలం 3 వేల రూపాయలు పెన్షన్ నాలుగు వేలు చేసారు తప్ప 13 నెలలు అవుతున్న 60 సవత్సరాలు దాటిన అవ్వ తాతలకి కొత్తగా ఒక్క కొత్త పెన్షన్ మంజూరు చేసారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అయ్యిందని, ఒక్కరికి అయిన ఈ రాష్ట్రంలో మీరు ఈ పథకం ఇచ్చామని చూపిస్తే మేము రాజకీయాలనుంచి తప్పుకుంటామన్నారు. కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు చింతాడ లక్ష్మణ, గవిడి సురేష్, కర్రోతు ప్రసాద్, కంచుపల్లి అశోక్, ప్రభాత్ కుమార్, మామిడి నరసింగ్, వెంకీ, రామగురువులు పాల్గొన్నారు.

దివ్యాంగుల వనరుల కేంద్రానికి సౌండ్ సిస్టం వితరణ

విశాలాంధ్ర - బాడంగి: స్థానిక బాడంగి జడ్పీ పాఠశాలలో ఉన్న సెకండరీ దివ్యాంగుల వనరుల కేంద్రానికి బూసాయవలస గ్రామానికి చెందిన వెంకటేశ్వర బోర్వెల్స్ ఓనర్ మచ్చెట్టి శ్రీను,అనూష దంపతులు 20 వేలు విలువగల సౌండ్ సిస్టం,2 ఫ్యాన్లు వితరణ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయుడు మాట్లాడుతూ వెంకటేశ్వర బోర్వెల్స్ వారు ప్రతీ ఏడాది దివ్యాంగులకు ఆర్థిక సాయం చేస్తూనే దివ్యాంగుల వనరుల కేంద్రానికి,పాఠశాల అవసరాల నిమిత్తం గతంలో కూడా 25 చైర్స్,కలర్ ప్రింటర్ వితరణ చేశారని గుర్తు చేశారు. దాతలను ప్రధానోపాధ్యాయులు దత్తి సత్యన్నారాయణ ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యు.రామారావు,ఎం శ్రీనివాసరావు,ఇతర ఉపాధ్యాయులు,దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత కార్యాలయాలుగా తీర్చిదిద్దాలి

విశాలాంధ్ర -విజయనగరం :ఆగస్టు 15 నుండి నగరంలోని అన్ని సచివాలయాలు, నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించినట్లు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. బుధవారం కార్యాలయంలో ప్రజారోగ్య సిబ్బంది, సచివాలయ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2 నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, అందుకు సన్నాహకంగా ఆగస్టు 15వ తేదీ నుండి ప్లాస్టిక్ రహిత కార్యాలయంగా తీర్చిదిద్దేందుకు సమాయత్తమవుతున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. అలాగే ఇంటింటి చెత్త సేకరణ శతశాతం జరిగే విధంగా చూడాలన్నారు. హోం కంపోస్ట్ పై ప్రజలలో అవగాహన పెంచాలన్నారు. మిద్దెపంటలను ప్రోత్సహించాలని చెప్పారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని, విక్రయాలపై దాడులు ముమ్మరం చేయాలన్నారు. ఈ నెలలో 50,000 మొక్కలను నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. ఎస్బిటీ మార్కెట్లో ప్రతి దుకాణానికి డి%ఉ%ఓ ట్రేడ్ లైసెన్సులను తప్పనిసరిగా విధించాలన్నారు. నిరాకరించిన దుకాణాలను మూసి వేయించాలని, సిబ్బందికి ఆదేశించారు. జన సమ్మర్థం ఉన్న ప్రాంతాలలో పశు సంచారం లేకుండా చూడాలని చెప్పారు. పని తీరుని మెరుగుపరుచుకుని సమర్థవంతమైన పౌర సేవలను అందించాలని చెప్పారు. ఈ సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, మేస్త్రీలు, సూపర్వైజర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

దుకాణ అద్దె బకాయిలు ఉపేక్షించం

విశాలాంధ్ర - విజయనగరం :నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న దుకాణ అద్దె బకాయిలను ఉపేక్షించబోమని సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు అన్నారు. ఈ మేరకు బుధవారం ఐడియస్ యంటి షాపింగ్ కాంప్లెక్స్ లో బకాయి ఉన్న దుకాణాల వద్దకు వెళ్లి అద్దెలను రాబట్టారు. కొందరు కొంత సమయం కావాలని కోరగా కాల పరిమితిలోగా అద్దెలు చెల్లించాలని లేనియెడల దుకాణాలను మూసివేస్తామని తెలిపారు. ఈ మధ్య అద్దె దుకాణాల వద్దకు వెళ్లి నోటీసులు అందించడంతోపాటు తక్షణమే అద్దెలు చెల్లించాలని చెప్పారు. దీంతో ఈ రోజు కొంతమంది చెల్లించారు. మిగిలిన వారు కూడా తక్షణమే చెల్లించాలని సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు చెప్పారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర, విజయనగరం, కంటోన్మెంట్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.భబిత ఆధ్వర్యంలో ప్రముఖ చిట్ఫండ్ కంపెనీలకు బ్యాంక్ మేనేజర్లు,బ్యాంక్ కు సంబంధించిన అధికారులతో కంపెనీ యొక్క న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చిట్ కంపెనీలకు, బ్యాంక్ కు సంబంధించిన కేసులను త్వరలో 13.09.2025 జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ సంఖ్యలో పరిష్కరించుకోవాలని కంపెనీలకు సంబంధించిన బ్యాంక్ మేనేజర్లతో తో సమావేశం ఏర్పాటు చేశారు. పెండింగ్ లో ఉన్న ఈ.పి.లు, బ్యాంకు దావాలను ఎక్కువ కేసులను రాజీ చేయాలని వారికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఏ కృష్ణ ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్, మార్గదర్శి చిట్ ఫండ్స్,కపిల్ చిట్ ఫండ్స్,శ్రీరామ్ చిట్ ఫండ్స్,శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం

విశాలాంధ్ర - మెంటాడ: గత ప్రభుత్వంలో గ్రామ స్వరాజ్యం పేరిట గ్రామ సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజా అవసరాల నిమిత్తం ప్రజలకు అందుబాటులో ఉండేలా అన్ని శాఖలకు సంబంధించిన ఉద్యోగులు గత ఐదు సంవత్సరాల నుండి ఒకే ప్రదేశంలో విధులు నిర్వహిస్తున్న వారిపట్ల ప్రభుత్వ ఆదేశాల మేరకు బదిలీలు జరిగిన సంఘటన అందరికీ విధితమే. మండలంలో గల గుర్ల తమ్మి రాజుపేట గ్రామస్తులు గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు అధికారుల సహకారంతో ఐదు సంవత్సరాలు సేవలందించిన సచివాలయ సిబ్బందిని గౌరవించి వారి సేవలను గుర్తించి వారిని సన్మానించారు. మాజీ వైస్ సర్పంచ్ చౌక్కాకు సన్యాసినాయుడు ఆధ్వర్యంలో సచివాలయ కార్యదర్శి ఎల్.ముత్యాలనాయుడు అధ్యక్షతన టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు ముఖ్యఅతిథిగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సిద్దల లక్ష్మి, ఎంపీడీవో భానుమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో విమల కుమారి, గ్రామ పెద్దలు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

చెత్త బుట్టల పంపిణీ

విశాలాంధ్ర -విజయనగరం: వీధివిక్రయిదారులు, చిరు వ్యాపారులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య సిబ్బంది చెత్త బుట్టలను బుధవారం అందజేశారు. గంటస్తంభం నుండి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు ఉన్న వీధివిక్రయదారులకు, తోపుడుబళ్ళ వర్తకులకు, చిరు వ్యాపారులకు చెత్త బుట్టలను అందించి ఇకనుండి వ్యర్థాలను ఆయా బుట్టలలో వేయాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్న ధ్యేయంతో అనేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా మార్కెట్ ప్రాంతాలలో చిరు వ్యాపారులు తోపుడుబళ్ళ వర్తకులు వ్యర్థాలను, ప్లాస్టిక్ కవర్లను విచ్చలవిడిగా కాలువల్లో పారబోస్తున్నారన్నారు. దీంతో వర్తకులకు చెత్త బుట్టలను అందజేసామని, ఇకనుండి ఆయా బట్టల్లో మాత్రమే చెత్తలు వేయాలని చెప్పారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - బొబ్బిలి : సమాజంలో ప్రతి ఒక్కరు మత్తు రహిత సమాజం కోసం కృషి చేయాలని నేటి యువతీ యువకులంతా నైతిక విలువలతో కూడిన విద్య పైన దృష్టి సారించాలని వివిధ పోటీ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని దీంతో తల్లిదండ్రులకు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని పట్టణ సీఐ కే సతీష్ కుమార్ అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు మత్తు పదార్థాలు వినియోగం వల్ల విలువైన జీవితాలు నాశనమై కుటుంబాలు జైలు పాలు కావద్దని కోరారు. పట్టణ పరిధిలో గల తాండ్ర పాపరాయ జూనియర్ కాలేజీ లో గల విద్యార్థిని విద్యార్థులు తో మాట్లాడి సమస్య లను తెలుసుకొని ప్రస్తుత పరిస్థితులు వివరించి అందుకను గుణముగా వివేకము తో ఉంటూ చెడు ప్రభావాలకు లోను కాకుండా ఉంటూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని మంచి భవిష్యత్ కు పునాదులు వేసుకోవాలని , రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీస్ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీస్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం

విశాలాంధ్ర - బాడంగి: మండలం తెంటువలస సచివాలయం సిబ్బంది బదిలీపై వెళ్లిన వారిని తెంటువలస సర్పంచ్ తెంటు చిరంజీవిరావు, ఆవు సత్యన్నారాయణ, పంచాయతీ సెక్రటరీ సమీర్ ఘనంగా బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధ నిర్వహణలో చక్కగా పనిచేస్తున్న సిబ్బంది వెళ్లిపోవడం బాధాకరమే విషయం అన్నారు. నూతనంగా వచ్చిన సిబ్బంది కూడా చక్కగా పనిచేసే ప్రజల మన్నన పొందాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ పొట్ట బంగారు బాబు, డిజిటల్ అసిస్టెంట్ అంజి దాసరి, అగ్రికల్చర్ అసిస్టెంట్ గేదెల శరత్, వెటర్నరీ అసిస్టెంట్ పెరుమాళ్ళ గణేష్, ఏఎన్ఎం రెడ్డి అనురాధ, మహిళా పోలీస్ షేక్ టాస్లిమ బేగం తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ వసతిగృహాలు, గురుకుల విద్యాలయాల సమస్యలను పరిష్కరించాలి

వైసిపి యువజన విభాగ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ప్రభుత్వ వసతిగృహాల గురుకుల విద్యాలయాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సూచనలతో జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ సంక్షేమ హాస్టలను తనిఖీలు నిర్వహించామన్నారు. అనేక హాస్టల్లో పూర్తిగా పారిశుధ్యం లోపించిందన్నారు. స్నానపు గదులు మరుగుదొడ్లు సరిపడా లేక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. తక్షణమే అన్ని హాస్టల్లో మౌలిక వస్తాలు కల్పించాలని, మెస్ బిల్లులు కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయాలన్నారు. శిథిలావస్థకు చేరిన హాస్టళ్లకు మరమ్మత్తులు కోసం నిధులు కేటాయించాలన్నారు. హాస్టల్ వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని, నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు హాస్టల్లో వారంలో ఒకరోజు బస చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం అధ్యక్షులు కరుమజ్జి సాయి ,భార్గవ్, లంక సురేష్, పవన్ , గౌతమ్ తదితరులు పాల్గొన్నారు

రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం ప్రారంభం

ఏపీజీ ఈఏ అధ్యక్ష, కార్యదర్శులుకంది వెంకటరమణ, బాలభాస్కరరావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఈనెల 5 నుండి 16 వరకు రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఎపిజి ఈఏ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంది వెంకట రమణ, బలివాడ బాల భాస్కరరావు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ కాంటీన్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక,పెన్షనర్స్ పేరుకుపోయిన బకాయిలు, పెండింగ్ సమస్యల పరిస్కారానికి వినూత్న పద్దతిలో మంగళవారం నుండి ఈనెల 16 వరకు రండిటీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా. జిల్లాలో గల 10 తాలూకాలలో, కార్యాచరణ చేపట్టారు. బుధవారం నుండి జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఆగస్టు16న కార్యక్రమంపై చర్చ ఏపీజీఇఏ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించబడుతుందని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో ఏపీజీ ఈఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డబ్బా పాలతో పిల్లలకు అనేక అనారోగ్య సమస్యలు...

విజయనగరం అర్బన్ ప్రాజెక్ట్ సీడీ పీ ఓ ప్రసన్న కుమారి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్: విజయనగరం మండలం ద్వారపూడి గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రం 2లో తల్లిపాలు వారోత్సవాలను బుదవారం ఘనంగా నిర్వహించారు .విజయనగరం అర్బన్ ప్రాజెక్టు సిడిపిఓ ప్రసన్న కుమారి మాట్లాడుతూ గర్భిణీలకు, బాలింతలకు,తల్లి పాలు ప్రాముఖ్యత గురించి వివరించారు. నెలలవరకు కేవలం తల్లి పాలుమాత్రమే బిడ్డకు ఇవ్వాలనీ,తల్లి పాలు బిడ్డకి పెట్టడం వలన తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్ వంటి అనారోగ్యాలు దరి చేరవ న్నారు. తల్లిపాలువలన తల్లికి,బిడ్డకి అనుబంధం ఏర్పడుతుందనీ,తల్లిపాలు వలన తల్లికి బిడ్డకి కూడా ఆరోగ్యం గా ఉంది ఎటువంటి అనారోగ్యాలు రాకుండా తల్లి అందంగా కూడా తయారవుతారన్నారు.తల్లి పాలు బిడ్డకి మొదటి టీ కా అని, తల్లిపాలు అమృతం వంటివి అని డబ్బా పాలు వలన పిల్లలకి అనారోగ్యాలు వస్తాయన్నారు. తల్లి పాలు మాత్రమే బిడ్డ కు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆదిలక్ష్మి ,సూపర్ వైజర్ అర్.పైడితల్లి, ఏ.ఎన్.ఎం, అంగన్ వాడీ వర్కర్స్ ,ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ నిఘాలో పోలీస్ కేసులు

విశాలాంధ్ర-బొబ్బిలి : విజయనగరం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ ఆదేశాలపై స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ కె. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది తో బుధవారం డ్రోన్ సాంకేతికత ను ఉపయోగించి బొబ్బిలి పరిధిలో గల నిర్జన ప్రదేశాలలో, ఓపెన్ డ్రింకింగ్, పేకాట, మరియు అశాంగిక కార్యక్రమ లు పాల్పడిన వారి పై పటిష్టమైన నిఘా ను నిర్వహించి బహిరంగ ప్రదేశాలలో మద్యము సేవించిన వారిని పట్టుకొని కేసు లు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సతీష్ కుమార్ విలేకరులకు తెలిపారు.

పక్కి గ్రామంలో వెటర్నరీ డిస్పెన్సరీ ని పరిశీలించిన ఎమ్మెల్యే బేబీనాయన బుడా చైర్మన్ తెంటు లక్ష్మ నాయుడు

విశాలాంధ్ర -బొబ్బిలి: మండలం, పక్కి గ్రామంలో శంబంగి అప్పలనాయుడు, శంబంగి శంకరరావు (ధోని) మేనకోడలు బారసాల ఫంక్షన్ కి వెళ్లి ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన), బుడా చైర్మన్ , మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మ నాయుడు చిరంజీవిని ఆశీర్వదించారు.. అనంతరం, గ్రామంలో పక్కి వెటర్నరీ డిస్పెన్సరీ ని సందర్శించారు..డిస్పెన్సరీ భవనం నిర్మించి చాలా ఏళ్ల అయినందున, నూతన భవనం నిర్మాణం కోసం నాబార్డు నిధులను మంజూరు చేయాలని సంబంధిత మంత్రితో మాట్లాడుతానని తెలిపారు.ఈ కార్యక్రమంలో పక్కి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నంద్యాలలో పప్పుల మిల్లు, పశు శుద్ధి కర్మాగారానికి ప్రారంభం

విశాలాంధ్ర -భోగాపురం: మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు నంద్యాల (కర్నూలు జిల్లా)లో పప్పుల మిల్లు మరియు పశు శుద్ధి కర్మాగారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు పోషకాహారంగా కూడిన ఆహారపదార్థాలను ప్రభుత్వం సబ్సిడీ ధరలకే అందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా పశుదాన కర్మాగారం స్థాపించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్లు ఆనెపు రామకృష్ణ నాయుడు, కెసి హరి, తాతిరెడ్డి తులసిరెడ్డి, శశిభూషణ్ రెడ్డి, నరసింహారావు, జీఎం శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

నారాయణ పబ్లిక్ స్కూల్‌లో 'ఘర్ -తిరంగ్'

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: స్థానిక గాజుల రేగ వద్దఉన్ననారాయణ పబ్లిక్ పాఠశాలలో స్వాతంత్ర్యది నోత్సవం" ను పురస్కరించుకొని మకోఘర్ -తిరంగ్" కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులచే రంగోళి, రాఖీ , జాతీయ జెండాలను తయారుచేసి ప్రదర్శించిన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా కరస్పాండెంట్ మోయిద నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి విద దేశభక్తి"ని పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలుఎంతగానో దోహదపడతాయన్నారు. నారాయణ పాఠశాలలో నిరంతరం విద్యార్థులకు మేధాశక్తి పెంపొందించే ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రమేష్ యాదవ్ పై దాడసరి కాదు

వైసిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు బర్రి చిన్నప్పన్న

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: రాష్ట్ర వైస్సార్ కాంగ్రెస్ పార్టీ వెనుకబడిన తరగతుల విభాగం అధ్యక్షులు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ గారి పైన దాడి చేయడం సరైన పద్ధతి కాదని వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు బర్రి చిన్నప్పన్న అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు, ఓటములు ప్రజలు నిర్ణయిస్తారనికాని భవిష్యత్ మీకు కళ్ల ముందు కనపడేసరికి ఈవిదంగా గుండా గిరి చేయడం తెలుగుదేశం నాయకులకు తగదన్నారు. వెనకబడినతరగతుల నాయకుడుపై కారు అద్దాలు పగలు కొట్టిహత్యాప్రయత్నం చేయడం తగదన్నారు. భయానక పరిస్థితిలు సృష్టించి అనైతకంగా గెలవాలిఅనుకోవడం మీ చేష్టలు పరాకాష్టకుచేరి మీ పతనానికి దారితీస్తుందన్నారు.ఇలాంటి దుష్ట చర్యలను ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ముక్తకంఠం తో ఖండించాలన్నారు.

కమిషనర్ చొరవతో ఆక్రమణ తొలగింపు...!

అదే స్థానంలో మరో రూపంలో ఆక్రమించారు

విశాలాంధ్ర -రాజాం: రాజాం పాలకొండ ప్రధానరహదారి లో జెజె ఇనోటల్ హోటల్ పక్కన చెరువు నుండి సుమారు 12 అడుగుల కాలువ ద్వారా వచ్చే నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న స్థలాన్ని అక్రమ నిర్మాణం చేపట్టి వ్యాపారం సాగిస్తున్న ఈ ఆక్రమణను గత కొన్ని రోజుల క్రితం రాజాం మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తొలగించారు. అయితే ఆస్థానంలో కాలువ నిర్మాణానికి పనులు జరుగుతుంటుండగా హఠాత్తుగా బుధవారం తెల్లవారేసరికి అదే స్థానంలో బడ్డీ రూపంలో ఆక్రమణ ప్రత్యక్షం అయింది. ప్రజల దృష్టి మళ్లించడానికి రాత్రికి రాత్రి ఎంత చక్కగా షాపును ఏర్పాటు చేశారో చెప్పుకోదగ్గ విషయం. గతంలో తొలగించిన ఈ ఆక్రమణను మళ్లీ ఆక్రమించడం వెనుక ఎవరు హస్తం ఉందో, లేదంటే ముడుపులు అంది ఉంటాయేమోనని అని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. ఏది ఏదైనా సరే ఏమాత్రం వర్షం పడినా, ఇప్పటికే కాలువల్లో మురుగునీరు ప్రధాన రోడ్లమీదకు వస్తున్న పరిస్థితి రాజాం పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి ఆక్రమణలకు కట్టుడు చేయకపోతే భవిష్యత్తులో రాజాం ప్రాంతవాసులు మురికి నీటి కాలువలు తో అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది అని, అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ ఆక్రమణ వెంటనే తొలగించాలని పలువురు కోరుకుంటున్నారు.

అధాని హైడ్రోపవర్ ప్లాంట్ నిర్మాణానికై ముందుకు వస్తె తరిమి కొడతాం..

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట ఉపాధ్యక్షులు వెంకన్న

విశాలాంధ్ర-వేపాద: మండలం లోని గిరి శిఖర మారిక గ్రామంలో అధాని తల పెట్టిన హైడ్రోపవర్ ప్లాంట్ నిర్మాణానికి ముందుకు వస్తె తరిమి కోడతామని వ్యసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న.ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాద్యాక్షులు చల్లాజగన్ బుధవారం మారిక గిరిజనులతో కలిసి మారిక గ్రామంలో సంప్రదాయ విల్లుంభులు పట్టుకొని పెద్ద ఎత్తున,ఆందోన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవరాపల్లిలో మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ చేసిన ప్రకటనకు జీఓ తెచ్చి మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రైవాడ ప్రాజెక్టు ఎరియాలో చింతలపూడి పంచాయతీ పరిదిలో శారదా నదిపై 900 మెగావాట్లుకు అదాని హైడ్రోపవర్ ప్లాంట్లు నిర్మాణానికి జీఓ నెంబర్ 51ని ప్రభుత్వ విడుదలచేసి రైవాడ డ్యాం సమీపంలో దిగువ ప్రాజెక్టు,మారికలో ఎగువ ప్రాజెక్టు నిర్మించుని గిరిజనులు రైతులు బ్రతుకులు బుగ్గిపాలు చేయాలని చూస్తున్నారన్నారు. మారికపై నుండి వచ్చే మారిక గెడ్డలు నీళు నిలిచి పోతే నాగయ్య పేట, వావిలపాడు,నల్లబిల్లి వీలుపర్తితో పాటు అనేక గ్రామాలకు సాగునీరు ప్రమాదం ఏర్పడుతుందన్నారు.తరతరాలుగా మారికలో గిరిజన సంప్రదాయంతో స్వేచ్ఛగా జీవిస్తున్న గిరిజనులు జీవితాలను నాశనం చేయడానికి అదాని సంస్థ పూనుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో న్యూ అండ్ రెన్యూ వబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎన్.ఆర్.ఇ.డి.సి.ఎ.పి) ద్వారా లిఫ్ట్ పంపుడు స్టోరేజి పవర్ ప్రాజెక్టులకు 2019 నుండి 2025 మధ్య రాష్ట్ర ప్రభుత్వాలు అను మతులు మంజూరు చేసాయని తెలిపారు. గిరిజన ప్రాంతాలలో రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రాంతాల్లోని ఆదివాసీలను, ఇతర పేదలను వారి ఆవాసాల నుంచి వెళ్ల గొట్టేందుకు తీవ్ర ప్రయత్నం చేయడం దారుణమన్నారు,దీన్ని గిరిజనులు ప్రతిఘటిస్తున్నారని తెలిపారు. చింతలపూడి మారిక మద్యలో అదాని గ్రూపు సంస్థలు మారిక చింతలపూడి గ్రామాలను కాలీ చెయించే ప్రయత్నం ముమ్మరం చేయగా మారిక గిరిజలు సామాజిక ఆర్థిక సర్వేను అడ్డుకున్నారని తెలిపారు. అయిప్పటికి మారిక గిరిజనలపై విధ్వంసం సృష్టించడానికి అదాని మనుషలు పూనుకున్నారని గిరిజనులు ఐక్యమత్యంతో తరిమికోడ తామని స్పష్టం చేశారు.ఈకార్యక్రమంలో వీర్రాజు ఆనంద్ సోమేష్ అప్పలనాయుడు. తదితరులు పాల్గొన్నారు.

సీతండైరెక్టర్‌కు ఫేమస్ పీపుల్ ఇండియా వరల్డ్ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ గుర్తింపు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సత్య గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శశిభూషణ రావు, సాఫ్ట్ స్కిల్స్: నావిగేటింగ్ ది పాత్ - కీ స్కిల్స్ ఫర్ ట్రాన్సిషనింగ్ ఫ్రమ్ క్లాస్‌రూమ్ టు బోర్డ్‌రూమ్ అనే విశిష్ట ప్రచురణకు రవీంద్రనాథ్ ఠాగూర్ సమ్మాన్ 2025 కింద 'బెస్ట్ బుక్ ఆఫ్ ది వరల్డ్' అవార్డుతో సత్కరించబడ్డారు. ఇంగ్లీష్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్. సతీష్‌కుమార్ సహ రచయితగా ఉన్న ఈ పుస్తకం, విద్యా, వృత్తిపరమైన నైపుణ్యాల మధ్య అంతరాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషించే సాఫ్ట్ స్కిల్స్ డెవలప్‌మెంట్‌కు దాని అంతర్దృష్టి, ఆచరణాత్మక విధానానికి గుర్తింపు పొందింది. ఈ అంతర్జాతీయ ప్రశంస సాహిత్యం, విద్య, నాయకత్వంలో అత్యుత్తమ సహకారాలను జరుపుకుంటుంది. ఈ సందర్భంగా డాక్టర్ శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు, నిపుణులను అవసరమైన జీవితం మరియు కెరీర్ నైపుణ్యాలతో సన్నద్ధం చేయడంలో మా అంకితభావానికి ఈ గుర్తింపు నిలుస్తుందన్నారు. ఈ ప్రపంచ గుర్తింపు మాకు ఎంతో గౌరవంగా ఉందన్నారు.ఈ పుస్తకం విద్యా మరియు కార్పొరేట్ రంగాల నుండి సానుకూల ప్రశంసలను పొందిందని, విద్యా సంస్థలలో సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ కోసం విలువైన వనరుగా ఎక్కువగా ఉపయోగపడతాదన్నారు

మొదట్లో ఉపాధ్యాయశక్తి ఐచ్ఛికమని చెప్పి ఇప్పుడు నిర్బంధం చేయడం దారుణం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఈ విద్యా సంవత్సరం నుండి విద్యా శాఖ విద్యాశక్తి అనే కార్యక్రమం నిర్వహిస్తుందని మొదట్లో ఐచ్ఛికము అని చెప్పి ప్రస్తుతం నిర్బంధం చేయడాన్ని విరమించాలని ఫ్యాప్టో చైర్మన్ పాలతేరు శ్రీనివాస్ అన్నారు. దీనికి సంబంధించి బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడుకు వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ సంఘాలతో మొదట్లో ఉపాధ్యాయశక్తి ఐచ్ఛికమని చెప్పి ఇప్పుడు నిర్బంధం కార్యక్రమం నిర్వహించడం సరైనది కాదన్నారు. మొదట జూలై 31 వరకు ఇచ్చి తెలియజేసి ఇప్పుడు మార్చి 31వరకు తప్పనిసరి అని అధికారులు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం 10వ తరగతి విద్యార్థులకు ప్రతిరోజు సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. 6 నుండి 9 తరగతి విద్యార్థులకు జరిగే విద్యా శక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నామన్నారు. .ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో సభ్యులు జే ఏ వి ఆర్ కె ఈశ్వరరావు, ఎన్ వి పైడిరాజు, కె. జోగారావు, టి సన్యాసిరాజు, ఎస్. భాస్కరరావు, కె .శ్రీనివాసరావు, సిహెచ్ సూరిబాబు, ఎం ఏ స్వామి, ఎన్ అధివిష్ణు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వల్ల దుర్గంధం

గ్రామస్తులకు తీవ్ర అసౌకర్యం

విశాలాంధ్ర-భోగాపురం : రెడ్డి కంచెబు గ్రామ పరిసరాల్లో చికెన్ వ్యర్థాలను చీల్చి పారవేయడం వల్ల దుర్గంధం తాళలేని స్థితికి చేరింది. ఈ కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మలిన వాతావరణం, దోమలు, ముసురిన దుర్వాసనలు గ్రామంలో వ్యాధుల బెడదకు దారి తీసే అవకాశాలు పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రతకే ప్రాధాన్యత ఇవ్వాల్సిన ప్రస్తుత కాలంలో, ఇలా బహిరంగంగా మాంసపు వ్యర్థాలు పారవేయడం అనాగరికతకు నిదర్శనమని గ్రామస్తులు చెబుతున్నారు. "ఇప్పటికే వర్షాకాలం నేపథ్యంలో పలు రోగాలు సంచరిస్తున్నాయి. అలాంటిది ఇలాంటి దుర్వాసన వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు జలుబు, జ్వరం వంటి సమస్యలతో బాధపడుతున్నారు.అధికారులు వెంటనే స్పందించి, చికెన్ వ్యర్థాల నిర్వాహణకు సరైన పద్ధతులు తీసుకోవాలని, కఠిన చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు రహిత సమాజం కోసం యువతీ యువకులంతా కృషి చేయాలి : సిఐ

విశాలాంధ్ర-బొబ్బిలి: సమాజంలో ప్రతి ఒక్కరు మత్తు రహిత సమాజం కోసం కృషి చేయాలని నేటి యువతీ యువకులంతా నైతిక విలువలతో కూడిన విద్య పైన దృష్టి సారించాలని వివిధ పోటీ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని దీంతో తల్లిదండ్రులకు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని పట్టణ సీఐ కే సతీష్ కుమార్ అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు మత్తు పదార్థాలు వినియోగం వల్ల విలువైన జీవితాలు నాశనమై కుటుంబాలు జైలు పాలు కావద్దని కోరారు. పట్టణ పరిధిలో గల తాంద్ర పాపరాయ జూనియర్ కాలేజీ లో గల విద్యార్థిని విద్యార్థులు తో మాట్లాడి సమస్య లను తెలుసుకొని ప్రస్తుత పరిస్థితులు వివరించి అందుకను గుణముగా వివేకము తో ఉంటూ చెడు ప్రభావాలకు లోను కాకుండా ఉంటూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని మంచి భవిష్యత్ కు పునాదులు వేసుకోవాలని , రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీస్ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీస్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.